క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మ ఊరేగింపు



గంగాధర నెల్లూరు: మండలంలోని వేల్కూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఊరేగింపు కార్యక్రమం బుధవారం, గురువారం వైభవంగా జరిగింది. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో పంబ వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి వసంతోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ప్రారంభించి గర్భిణులకు వైద్యాధికారి మోహన్‌కృష్ణ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా వాటి నివారణే ముఖ్యంగా ఆరోగ్య సిబ్బంది పని చేయాలని ఆయనతెలిపారు. గురువారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో రసాయనిక ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి నివారించాలంటే ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో కాచి వడపోసిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

అంజేరమ్మ కనుమలో భక్తుల రద్దీ



వడమాలపేట (విజయపురం): కనుమ పండుగ సందర్భంగా వడమాలపేట మండలం అంజేరమ్మ కనుమలో అంజేరమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్తలు గురువారం తెల్లవారుజామున నుంచే విస్తృత ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిసర గ్రామాల ప్రజలే కాక దూరప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

రేపు వేమన పద్యాల పోటీ

పలమనేరు: వేమన జయంతి సందర్భంగా జాతీయ స్థాయి వేమన పద్యాల పోటీలను ఈనెల 18 నిర్వహించనున్నట్టు స్థానిక తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకు పైగా వేమన పద్యాలను చెప్పగలిగే పిల్లల ఇప్పటికే వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకున్నారు. వీరికి పోటీలను శనివారం నిర్వహించి గెలుపొందిన పిల్లలకు అదే రోజు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలియజేశారు.

కొనసాగుతున్న రైతుల దీక్ష



దీక్షలు చేస్తున్న రైతులు

కుప్పంరూరల్: మండలంలోని ఆవులనత్తం వద్ద ఉన్న జెల్లీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతుల నిరసన దీక్షలు 11వ రోజుకు చేరాయి. జెల్లీ ఫ్యాక్టరీ వల్ల తమ గృహాలు, పొలాలు, ఆరోగ్యాలు పాడవుతున్నాయని రైతులు 11 రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. జిల్లా అధికారులైనా తమపై దయ చూపాలని రైతులు కోరారు.

వేడుకగా గోవిందుడి పార్వేట ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి పార్వేట ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి తర్వాత కనుమ పండుగ నాడు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులు ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ స్వామివారి ఆస్థానం నిర్వహించారు. పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామి పార్వేటను తిలకించారు. అనంతరం తిరిగి నగర వీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6 గంటలకు ఆలయానికి వేంచేపు చేశారు. కార్యక్రమంలో టీటీడీ స్థానిక ఆలయాల డెప్యూటీ ఈఓ శాంతి, ఆలయ అర్చకులు, ఇతర అధికార ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవం.. గిరి ప్రదక్షిణ ఉత్సవం

మండపంలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు, పుత్తూరు: కొండచుట్టు వద్ద కొలువైన విఘ్నేశ్వరుడు, శ్రీకృష్ణస్వామి







విజయపురం: భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి



మండపం ఆవరణలో కిక్కిరిసిన భక్తులు



పుత్తూరు కొండచుట్టు వద్ద భక్త సమూహం

- ఉదయం నుంచే జన సందోహం
- జోరుగా తినుబండారాలు, చెరకు గడలు, అలంకరణ వస్తువుల విక్రయాలు
- కొండచుట్టు మండపం వద్ద తిరునాళ్ల సందడి

నగరి: సంప్రదాయాలు, సంస్కృతికి అద్దంపట్టే పెద్ద పండుగను పురస్కరించుకుని ప్రతి ఏటా కనుమ పండుగకు మరునాడు ముక్కనుమ రోజున నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలు ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించారు.. ఉత్సవాలకు కేంద్రమైన కొండచుట్టు మండపం వద్ద గురువారం వేకువజాము నుంచే తిరునాళ్ల సందడి నెలకొంది. మండపం పరిసరాల్లో తినుబండారాలు, బొమ్మలు, గాజులు, చెరకు గడలు, అలంకరణ వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో దుకాణాలు వెలిసాయి. సాయంత్రం 4 గంటల నుంచి ప్రజలు కొండచుట్టు మండపం వైపు నడక సాగించడంలో సుమారు కిలోమీటరు మేర జనసందోహం కనిపించింది. నగరి పట్టణం వదలి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారు కూడా సంప్రదాయంగా వచ్చే ఈ వేడుకను తిలకించడానికి కొండచుట్టు ఉత్సవాలకు హాజరయ్యారు. రాత్రి దీప కాంతుల్లో కొండచుట్టు మండపం శోభాయమానంగా వెలుగులీనింది. మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వినాయకుడి దర్శనార్థం జనం క్యూలలో బారులుతీరారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలకు విచ్చేసే దేవతామూర్తులకు నగరి కరకంఠేశ్వర స్వామి స్వాగతం పలుకగా ట్రాక్టర్లలో అందమైన ప్రభలతో అలంకారపూరితమై విచ్చేసిన దేవతామూర్తులు మండపం ఆవరణలోని మైదానంలో చేరారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సాయినాథ్ గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ముగ్గురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు 50 మంది భద్రతా చర్యల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజా పార్టీ శ్రేణులతో కలిసి హాజరై మండలంలోని వినాయకుని, ఊరేగింపుగా విచ్చేసిన దేవతలను దర్శించుకున్నారు.

పుత్తూరు మండలంలో..

పుత్తూరు: సంక్రాంతి పండుగలో భాగంగా 4వ రోజు గురువారం కొండచుట్టు వైభవంగా నిర్వహించారు. పెద్ద పండుగలో చివరి ఘట్టమైన కొండచుట్టు ఉత్సవం మొత్తానికి తలమానికంగా నిలుస్తోంది. పుత్తూరులోని శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆహ్వానం మేరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవతామూర్తులు మండపం వద్దకు అతిథులుగా విచ్చేయడం కొండచుట్టు ఉత్సవం ప్రాముఖ్యత. తొలుత శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వచ్చి ఆశీనులయ్యారు. అతిథులుగా శ్రీవిఘ్నేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి, సీతా సమేత శ్రీరామస్వామి, ఆంజనేయస్వామి ఉన్నారు. వచ్చిన దేవతామూర్తులందరూ గ్రామంలోని విశేషాల గురించి మాట్లాడుకుంటారని ప్రతీతి. పలువురు దేవతామూర్తులందరూ ఒకేచోట కొలువుదీరడం చూసి తరించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అర్చన, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించారు. పట్టణం నుంచి మండపం వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అంగళ్లతో పట్టణం కళకళలాడింది.

విజయపురం మండలంలో..

విజయపురం: మండలంలోని ఆలపాకం పంచాయతీలో కొండచుట్టు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలపాకం, పన్నూరు తదితర గ్రామాల నుంచి ఊరేగింపుగా వచ్చిన దేవతామూర్తులు ఒకచోట చేరి భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.







ఊరేగింపుగా వస్తున్న కామాక్షీ సమేత కరకంఠేశ్వరుడు, దేవతామూర్తులను దర్శించుకుంటున్న మాజీమంత్రి ఆర్కేరోజా, పుత్తూరు: అలరించిన కోలాటం

దేవతామూర్తుల ఊరేగింపు

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం, కర్వరవేడు గ్రామాల్లో కొండచుట్టు ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామాపురం, పెద్దపట్టెడ వద్ద నిర్వహించిన ఉత్సవంలో కావునూరు, సదాశివపురం గ్రామాలకు చెందిన దేవతామూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి పూజలు చేశారు. అలాగే కర్వడవేడులో ఊరూరు, మిట్టకండ్రిగ, నెట్టేరి గ్రామాల దేవతామూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



శ్రీరామాపురంలో దేవతామూర్తుల ఊరేగింపు

వైభవంగా ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి



కోలాటం, భజనలను వీక్షిస్తున్న ప్రజలు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డి పల్లి గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం కొండచుట్టు ఉత్సవం వైభవంగా జరిగింది. ఏటా సంక్రాంతి పండుగ చివరి రోజున చెన్నకేశవ స్వామికి విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. గోవిందరెడ్డిపల్లి, చుట్టుపక్కల గ్రామస్తుల ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి మేళతాళాలతో డప్పు వాయిద్యాలతో కొండ చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కోలాట చెక్కభజనలు వీక్షకలను ఆకట్టుకున్నాయి.

సంక్రాంతి టోర్నీ విజేత తయ్యూరు



టోర్నీ విజేత పెద్దతయ్యూరు జట్టుతో నిర్వాహకులు

శ్రీరంగరాజపురం : మండలంలోని లక్ష్మిపురంలో నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌లో కత్తిరిపల్లి జట్టుపై పెద్దతయ్యూరు జట్టు గెలిచి విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు రూ.30 వేలు నగదు బహుమతితో పాటు కప్‌ను అందించారు. పోటీలో ప్రతిభ చాటిన సూరికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, అనిల్, నవీన్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను నయగర పెట్రోల్‌బంక్ యజమాని చేతుల మీదుగా అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులకు గ్రామస్తులు పెద్దఎత్తున బాణసంచాలు కాల్చి, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ వరదమ్మ క్రీడాకారులను అభినందించి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో ఖాతాదారుల రద్దీ



సప్తగిరి గ్రామీణ బ్యాంకులో బారులు తీరిన ఖాతాదారులు

తవణంపల్లె: బ్యాంకులకు ఐదు రోజుల పాటు సెలవులు రావడంతో లావాదేవీలు స్తంభించిపోయాయి. ఈ నెల 11వ తేదీ రెండవ శనివారం 12వ తేదీ ఆదివారం సెలవులు వచ్చాయి. మరోవైపు 13వ తేదీ సోమవారం నుంచి 15వ తేదీ బుధవారం వరకు సంక్రాంతి సెలవులు రావడంతో బ్యాంకులు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో 16వ తేదీ గురువారం బ్యాంకు సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో బ్యాంకుల వద్ద జనం రద్దీ కనిపించింది.

పండుగ జ్ఞాపకాలతో తిరుగు ప్రయాణం


నగరి: సంక్రాంతి సెలవులు ముగియడంతో దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు మళ్లీ తిరుగుప్రయాణమయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువుల నడుమ ఆనందంగా గడిపి పండుగ జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకున్నారు. ఉద్యోగరీత్యా శుక్రవారం నుంచి విధులకు హాజరుకావాల్సి ఉండడంతో స్వగ్రామాలకు బై..బై..చెప్పారు. బస్సులు, ట్రైన్లు కిక్కిరిసిపోయాయి. అరక్కోణం ప్యాసింజర్ రైలు ప్రయాణికులతో కిక్కిరిసి పల్లెవెలుగు బస్సును తలపించింది. రైళ్లలో రద్దీ మూలాన పలువురు నిలడి ప్రయాణించారు. మహిళలు తమ పిల్లలతో కింద కూర్చుని ప్రయాణించారు.



ట్రైన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

కమ్మేసిన పొగ మంచు

ఆవలకొండపై పొగ మంచు



కొండలను పొగమంచు కమ్మేస్తోంది. గురువారం ఉదయం 8:30 గంటలవుతున్నా మంచు కురుస్తూనే ఉంది. చాలాసేపు తరువాత సూర్యకిరణాలు మంచు తెరలను చీల్చుకుంటూ వచ్చాయి. గంగాధర నెల్లూరు మండలంలోని తూగుండ్రం వద్ద ఆవలకొండ మంచుతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులను కనువిందు చేసింది. - గంగాధర నెల్లూరు

అట్టహాసంగా వనవిహారం





ముగ్గుల పోటీలో మహిళలు, వన విహారంలో ఆర్యవైశ్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్యవైశ్య వనవిహార కమిటీ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోట్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గురువారం నగరంలోని కట్టమంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్, పాటలు, నృత్యం, రంగువల్లులు, లఘుచిత్ర, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. యువత, మహిళలు, పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చల్లూరు ద్వారకనాథ్, మట్టపల్లి శరవణ, ఆరూరు ప్రసాద్, ఎస్సీకే సత్యనారాయణ, పుష్ప స్టోర్ చంద్ర, గోవర్ధన్, రవీంద్రబాబు, ఆరూరు రామ్మూర్తి, బైసానీ బాబురావు, బైసాని చంద్రశేఖరరావు, చిలంకూరు వెంకటేష్, సంపత్, రాఘవరావు, రామ్మూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గంగినేని పార్కులో సందడి చేస్తున్న పిల్లలు

గోట్ సందడి..

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కనుమ పండుగ తర్వాత నాడు గోట్ నిర్వహించడం ఆనవాయితీ. పిల్లలతో గంగినేని పార్కు సందడిగా మారింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో తమ గురువులతో పూర్వ విద్యార్థులు

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం బలిజకండ్రిగ హైస్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్య నేర్పించిన గురువు రఘుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీచర్లకు పాదపూజ చేసి ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. నాటి హెచ్‌ఎం రఘు మాట్లాడుతూ తమ వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులంతా నేడు ఇలా కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జీవితం అంటే డబ్బు, ఆస్తులు సంపాదనే కాదు.. తమ వంతు ఇతరులకు సహాయం చేయడం గొప్పవిషయమన్నారు.

కోడెగిత్తల జోరు.. యువకుల హుషారు



టేకుమందలో పరుగులు తీస్తున్న ఎద్దు

బంగారుపాళెం: మండలంలోని టేకుమందలో గురువారం ముక్కనుమ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందేలు హోరెత్తించాయి. యువకులు కేరింతలు నడుమ ఎడ్లపరుగు పందేలు దుమ్మురేపాయి. పరిసర ప్రాంతాల నుంచి పందేలకు ఎద్దులను తీసుకొచ్చారు. పరుగులు పెడుతున్న ఎడ్లను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు గ్రామానికి వచ్చారు. మిద్దెలపై నుంచి ఎడ్ల పరుగు పందేలను తిలకిస్తూ కేరింతలు కొట్టారు.